

వెయిట్‌లిఫ్టింగ్‌లో క్రీడాపాఠశాలకు 14 పతకాలు

కర్నూలులో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్‌లో వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ సాధించింది. - 8లో



అంతర్ జిల్లా గంజాయి ముఠా గుట్టు రట్టు

అంతర్ జిల్లా గంజాయి విక్రయ ముఠా, నకిలీ నోట్ల చెలామణికి సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.7 /13.8

జిల్లాలో సోమవారం 28.7- 13.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

అర్హులకు 'వసతి దీవెన' అందించాలి

– జూమ్ కాన్ఫరెన్స్‌లో సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్



కడప రూరల్ : 'జగనన్న వసతి దీవెన' పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో జేడీ జయప్రకాష్, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కో ఆర్డినేటర్లతో జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ నెలాఖరుకు ప్రభుత్వం వసతి దీవెన కింద నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు 53 వేల మందికి పైగా ఉన్నారని అన్నారు. అందులో కొంత మంది విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో ఐదు అంశాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆ సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

– జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. భరత్‌రెడ్డి, రెడ్డిప్రసాద్



నూతనంగా ఎన్నికైన క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప స్పోర్ట్స్ : క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ కడప డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఎన్నికల అధికారి, మాజీ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా సాగాయి. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల జాబితాను ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ఈ నూతన కార్యవర్గం 2023 నుంచి 2026 వరకు కొనసాగనుంది.

జిల్లా అధ్యక్షుడుగా ఎం. భరత్‌రెడ్డి

సీఏవైడీ జిల్లా అధ్యక్షుడుగా వరుసగా రెండోసారి ఎం. భరత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతో పాటు ఉపాధ్యక్షుడుగా జి. నగేష్‌కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా అవ్వారు రెడ్డి ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం. సాయిపృధ్వీతేజ్, కోశాధికారిగా ఎం. మహేంద్రారెడ్డిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు కె. నిరంజన్‌కుమార్‌ను కౌన్సిలర్‌గా, కె. ఖాదర్‌బాషాను ఆడిట్ ఆఫీసర్‌గా, ఎస్. మౌనికను మహిళా ప్రతినిధిగా, సిరాజుద్దీన్ దౌలా మెన్ రెప్రజంటేటివ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఇప్పటి వరకు సేవలందించిన పూర్వపు జిల్లా కార్యదర్శి పి. సంజయ్‌కుమార్‌రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరణ

– ఏపీ ఉన్నత విద్యామండలిలో చార్జ్ తీసుకున్న ఆచార్య ఫజుల్ రెహమాన్



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య ఫజుల్ రెహమాన్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (ఎఫ్ఏసీ)గా ఆచార్య ఫజుల్ రెహమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నగరంలోని డా. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా పనిచేస్తున్న ఈయన్ను ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ ఉన్నతవిద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. దీంతో బుధవారం గుంటూరులోని ఏపీ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయన డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ స్థితిగతులను వీసీకి వివరించారు. సెలవుల అనంతరం విశ్వవిద్యాలయానికి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య వై. నజీర్‌అహ్మద్, డా. హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాస్, వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్ రెడ్డి, అనిల్, భావన పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

- జగనన్న తోడు పథకం కింద 6వ విడత లబ్ధి మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి
- జిల్లా వ్యాప్తంగా 8,240 మందికి రూ. 8.24 కోట్లు
- వడ్డీ రాయితీ కింద 22,336 మంది లబ్ధిదారులకు రూ. 49.41 లక్షలు



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న తోడు' పథకం చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికి బాసటగా నిలుస్తోందని కలెక్టర్ విజయ రామరాజు, ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ రెడ్డి, రఘురామిరెడ్డి లు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి మంత్రులు, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కలిసి మూడవ ఏడాది జగనన్న తోడు పథకం 6వ విడత లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుండి కలెక్టర్ విజయ రామరాజు తో పాటు కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పి. రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, జేసీ సాయికాంత్ వర్మ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్‌లు హాజరయ్యారు.

మెగా చెక్కు అందజేత

ముఖ్యమంత్రి వీసీ అనంతరం స్థానిక వీసీ హాలులో 6వ విడత జగనన్న తోడు పథకానికి సంబంధించి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 8,240 మంది చిరు వ్యాపారులకు మంజూరైన రూ. 8,24,00,000 లతో పాటు, 22,336 మంది మహిళలకు మంజూరైన రూ. 49,41,334 ల వడ్డీ రాయితీ మొత్తం మెగా చెక్కును అక్కడికి వచ్చిన గౌరవ అతిథులు లబ్ధిదారులకు అందజేశారు.

వడ్డీ లేకుండా పది వేలు

జగనన్న తోడు పథకం ద్వారా పేద చిరు వ్యాపారులకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ. 10 వేలు ప్రభుత్వం అందజేస్తోందని కలెక్టర్ విజయ రామరాజు తెలిపారు. రుణ సంవత్సర కాలంలో వడ్డీ లేకుండా అసలు మాత్రమే చెల్లించేలా ప్రభుత్వం సౌలభ్యం కల్పించిందన్నారు. రుణం పూర్తయిన తర్వాత మరలా రూ.10 వేలు తీసుకోవచ్చన్నారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. అర్హత ఉండి ఎవరైనా లబ్ధి పొందలేక పోతే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిరు వ్యాపారులకు భరోసా

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారుల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన నేపథ్యంలో అధికారంలోకి వచ్చాక జగనన్న తోడు పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యేలు రవీంద్రనాథ రెడ్డి, రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఈ పథకం చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రతి చిరు వ్యాపారి, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి హస్త కళాకారులకు, తోపుడుబండి నడుపుకునే వారిని ఆర్థికంగా ప్రగతి బాటలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఆకట్టుకున్న ఉత్పత్తులు

స్థానిక వీసీ హాలులో ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరైన పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రదర్శించిన ఉత్పత్తులు చూపరులను ఆకట్టుకున్నాయి. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలు రకాల సంప్రదాయ పిండి వంటలు, పచ్చళ్లు, హ్యాండ్‌మేడ్స్, గాజులు, సౌందర్య ఉత్పత్తులను కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డిలు పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు రామ్మోహన్‌రెడ్డి, పెద్దిరాజు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ రెడ్డిచర్ల ధనుంజయ, ఆయా బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న తోడు మా పాలిట వరం



చీరల వ్యాపారం చేసుకుంటున్న నాకు బయట వడ్డీలకు తెచ్చుకునే కష్టాలు తప్పాయి. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం మా పాలిట వరంగా మారింది. చీరల వ్యాపారం ద్వారా కుటుంబ ఆర్థిక అవసరాలను ఇబ్బంది లేకుండా తీర్చుకోగలుగుతున్నాను. నాలాంటి వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరం.

– కృష్ణవేణి, ఖాజీపల్లి, సిద్దవటం మండలం

వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం



కుటుంబ పోషణ కోసం ఇంటి వద్దనే చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాను. చుట్టుపక్కల వారంతా మా వద్దే వచ్చి కొంటున్నారు. వీటికి తోడు జగనన్న తోడు పథకం ద్వారా అందే ప్రభుత్వ సాయంతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటున్నాను. వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి అందుకుంటున్నాను. జగనన్న తోడు మా ఉపాధికి తోడుగా నిలిచింది.

– బేబి రాణి, సిద్దవటం

సంక్షేమ ఫలాలన్నీ మా కుటుంబం అందుకుంటోంది



కొన్నేళ్లుగా చీరల వ్యాపారం చేస్తున్నాను. సంక్షేమ ఫలాలు అన్నింటినీ మా కుటుంబం అనుభవిస్తోంది. అమ్మ ఒడి సాయం అందుతోంది. జగనన్న తోడు సాయం ఇప్పుడు అందుకున్నాను. ప్రస్తుతం వ్యాపారం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఎస్.రసూల్‌బీ, ఎర్రముక్కపల్లె, కడప

గండి అంజన్న సన్నిధిలో నిత్యాన్నదానం



గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఇక నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతి నిత్యం భక్తులకు అన్న ప్రసాదం పెట్టేందుకు దేవదాయ శాఖ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే .. గండిలో పేరుకే నిత్యాన్న దాన పథకం అని ఇక్కడ ఒక్క శనివారం మాత్రమే అన్నదానం ఉంటుందని, మిగిలిన రోజుల్లో ఉండదనే విమర్శ బలంగా ఉండేది. అయితే నిత్యాన్నదాన పథకానికి తగిన నిధులు లేవని ఇంత కాలం అధికారులు చెబుతూ వచ్చారు. అయితే ప్రస్తుత ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి దాతల నుంచి నిధులను చందాల రూపంలో తెప్పించారు. అయితే ఈ విషయంపై కూడా విమర్శకులు తమ వాదనను వినిపిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆలయానికి నిత్యాన్నదాన పథకానికి దాతలనుంచి వచ్చిన మొత్తం వడ్డీ అసలు కలిపి సుమారు రూ.1,60,00,000 చేరుకున్నట్లు సమాచారం. ఈ మొత్తానికి వచ్చే వడ్డీతో ప్రతి రోజు అన్న ప్రసాదం పెట్టి విమర్శకుల నోళ్లకు తాళం వేసే దిశగా ఆలయ అధికారి అనుమతి కోరుతూ దేవదాయశాఖ కమిషనర్‌కు గత నెలలో లేఖ పంపారు. ఇందుకు స్పందించిన ఆయన శనివారం రోజు భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని వెయ్యి మందికి, వారంలో మిగిలిన ఆరు దినాల్లో రోజుకు 200 మందికి అన్న ప్రసాదం చేసి వడ్డించాలని ఆదేశాలు పంపారు. ఈ ఆదేశాలు నేడో రేపో గండికి చేరనున్నాయి. దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు రానున్నాయనే విషయం తెలియగానే ఆలయ అధికారి ముకుందరెడ్డితో పాటు పాలక మండలి చైర్మన్ రాఘవేంద్రప్రసాద్‌లు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా శాశ్వత అన్నదాన కార్యక్రమం ప్రారంభించేందుకు ఆయనను ఆహ్వానించినట్లు సమాచారం. త్వరలో భక్తులకు నిత్యాన్నదాన సదుపాయం కలగనుంది.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో జగనన్న కాలనీలు, నిర్మాణ పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహ హక్కు, ఓటీఎస్ ప్రక్రియల యాక్షన్‌ప్లాన్‌తోపాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలపై మండల, నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశానికి జేసీ సాయికాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేయాలన్నారు. లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రారంభం కాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకు రావాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప అర్బన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడిపందేలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఓ పత్రికాప్రకటన విడుదల చేశారు. జూదం, కోడిపందేలు, గుండాట, అక్రమమద్య విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైనా కఠినంగా వ్యవహరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడిపందేల బరులు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గల పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సర్కారు బడి.. సంప్రదాయ సందడి



గొబ్బియ్యలో....గొబ్బియ్యలో అంటూ గొబ్బెమ్మను పూజిస్తున్న ఉపాధ్యాయినులు




ఐదడుగు, పులి అడుగు వేస్తున్న ఉపాధ్యాయులు

- గోదావరి జిల్లాలను తలపించిన ముందస్తు సంక్రాంతి వేడుక
- రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో పాతరోజులను గుర్తు చేసిన పెద్ద పండగ సందడి

రాజంపేట టౌన్ : సంక్రాంతి అంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది గోదావరి జిల్లాలు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం వరకు రాయలసీమ జిల్లాల్లో కూడా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేవారు. ప్రస్తుతం కాలానుగుణంగా వచ్చిన మార్పుల్లో ప్రజల అభిరుచులు కూడా మారాయి. అందువల్ల గతంతో పోల్చితే ప్రస్తుతం సంక్రాంతి సందడి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయిందనే చెప్పవచ్చు. అయితే రాజంపేట పట్టణం ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరమంటడమే కాక గోదావరి జిల్లాలను తలపించాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా సాంప్రదాయబద్ధంగా చేపట్టే కార్యక్రమాలతో పాటు ఆటవిడుపుకోసం చేపట్టే అన్ని ఆటలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం విశేషం. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టిన కార్యక్రమాల్లో విద్యార్థులే కాక ఉపాధ్యాయులు సైతం చిన్నపిల్లల్లా మారిపోయి సందడి చేశారు. ఉపాధ్యాయులు తప్పెట్ల దరువుకు ఐదడుగు, పులి అడుగు నృత్యాలతో మరింత జోష్ తెచ్చారు. మహిళా ఉపాధ్యాయులు గొబ్బెమ్మ పాటలతో ముందస్తు సంక్రాంతి వేడుకకు వన్నెతెచ్చారు. ఇక విద్యార్థులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. తమ ఆనందానికి ఆకాశమే హద్దు అన్న విధంగా అందరిని ఉర్రూతలూగించేలా సినిమా పాటలకు డ్యాన్స్ చేశారు. తోటి విద్యార్థుల ఈలలు, కేరింతలతో ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణం దద్దరిల్లింది. హరిదాసు వేషధారణ, పగటి వేషగాళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సరదాగా నిర్వహించిన కోడిపందెం అందరిలో ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసింది. మధ్యాహ్నం సంక్రాంతి వంటలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు భోగి మంట వేసి ముందస్తు సంక్రాంతి వేడుకలు ప్రారంభించగా, విద్యార్థులు గాలిపటాలు ఎగిరేసి వేడుకను ముగించారు.

ఆ గ్రామాల్లో సంక్రాంతి లేదు!

- తరతరాలుగా వస్తున్న ఆచారం
- నేటికీ గ్రామస్తులు కొనసాగిస్తున్న వైనం
- గుర్రంకొండ మండలంలో 18 గ్రామాల ప్రత్యేకత



సంక్రాంతి పండుగ జరుపుకోని టి.పసలవాండ్లపల్లె గ్రామం

గుర్రంకొండ : తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతి పండుగకు మొదటిస్థానం ఉంది. పంటలు బాగా పండి ధాన్యరాశులు ఇంటికి చేరుకొన్న తరువాత వచ్చే మొదటి పండుగ ఇదే కావడంతో సంక్రాంతి ప్రత్యేకతను సంతరించుకుంది. పంటలు పండించడానికి సాయపడే పశువులను భక్తితో పూజించడం ఈ పండుగలో విశేషం. ఆరుగాలం కష్టపడి పనిచేసే ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. అయితే ఇందుకు భిన్నంగా సంక్రాంతి పండుగను గుర్రంకొండ మండలంలోని 18 గ్రామాల్లో జరుపుకోరు. పాత కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని నేటి ఆధునిక కాలంలోనూ కొనసాగిస్తుండటం విశేషం.

సంప్రదాయాలు..ఆచారాలకు నిలయం

మారుమూల ప్రాంతమైన టి.పసలవాండ్లపల్లె పంచాయతీలోని మొత్తం 18 గ్రామాలను సంప్రదాయాలు, ఆచారాలకు నిలయంగా చెప్పుకోవచ్చు. పురాతన ఆచారం ప్రకారం ఈ గ్రామాల్లో సంక్రాంతి పండుగను జరుపుకోవడం నిషేధం. పల్లెల్లో పశువులను సింగారించడం, మేళతాళాలతో ఊరేగించడం వంటి దృశ్యాలు ఇక్కడ కనిపించవు. గ్రామ పొలిమేర్లలో చిట్లాకుప్పల వద్దకు పశువులను తీసుకెళ్లడం, పాడిఆవుల ఆరాధ్య దైవమైన కాటమరాయుడికి పూజలు నిర్వహించడం వంటి దృశ్యాలు మచ్చుకైనా కనిపించవు. గతంలో ఇక్కడి ప్రజల పూర్వీకులు ఏర్పాటు చేసుకొన్న కట్టుబాట్లకు నేటి తరం ప్రజలు కూడా కట్టుబడి ఉండడం ఈ గ్రామాల ప్రత్యేకత.

మార్చిలో జరిగే ఉత్సవాలే వీరికి సంక్రాంతి

ప్రతి సంవత్సరం మార్చినెలలో నిర్వహించే గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ జాతరే ఇక్కడి ప్రజలకు సంక్రాంతి పండుగ లాంటిది. గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ ఆజ్ఞానుసారం సంక్రాంతి పండుగ జరపకూడదంటూ పూర్వకాలంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. గ్రామంలో కొన్ని పశువులను గ్రామదేవత పల్లావలమ్మ పేరుమీద వదిలేసి కొందరు వాటిని మేపుతుంటారు. ప్రతి ఏడాది మార్చి నెలలో శ్రీ పల్లావలమ్మ జాతర నిర్వహిస్తారు. ఆ రోజున అమ్మవారి పేరుమీద వదిలిన ఆవులను మాత్రమే అందంగా అలంకరించి వాటిని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. అక్కడ వాటికి భక్తిశ్రద్ధలతో గ్రామస్తులందరూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదేవారికి సంక్రాంతి పండుగ.

పాడిఆవులతో వ్యవసాయం నిషిద్ధం

పాడిఆవులపై ఎంతో ప్రేమ కలిగిన ఈ గ్రామాల్లో పాడి ఆవులతో వ్యవసాయం చేయడం మాత్రం నిషిద్ధం. సాధారణంగా రైతులు ఇప్పటికీ చాలా గ్రామాల్లో పాడి ఆవులతో వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఈ 18 గ్రామాల్లో మాత్రం పాడిఆవులతో వ్యవసాయ పనులు చేయరు. గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించే సంస్కృతి ఇక్కడ మాత్రమే ఉండడం విశేషం. పూర్వపు తమ పెద్దల ఆచారం ప్రకారమే ఈ సంప్రదాయాన్ని నేటికి కొనసాగిస్తున్నారు.

ఆచారాలను మరువబోం



మా పూర్వీకులు, పెద్దలు ఆచరించిన ఆచారాలను, సంప్రదాయాలను మరవబోము. మా గ్రామదేవత శ్రీపల్లావలమ్మ ఉత్సవాల రోజున అమ్మవారి ఆవులను ఆలయం వద్దకు తీసుకొని వచ్చి పూజలు నిర్వహిస్తాం. అదే మాకు సంక్రాంతి పండుగ. అంతకు మించి ఇప్పుడు ఎలాంటి ఉత్సవాలు ఇక్కడ జరగవు.

– బ్రహ్మయ్య, ఆలయపూజారి, బత్తినగారిపల్లె

మార్కెట్‌లో రంగుల కళ

కడప కల్చరల్ : జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేకించి సంక్రాంతి పండుగకు ముగ్గుల పండుగగా పేరుంది. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో ముగ్గులు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు రంగుల ముగ్గుపొడులను ఇష్టంగా కొంటున్నారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు కడప మార్కెట్‌లో దాదాపు 20కి పైగా దుకాణాలు వెలిశాయి. తెల్ల ముగ్గుపిండితోపాటు రంగులు కలిపిన ముగ్గుపిండికి కూడా డిమాండ్ ఏర్పడింది. అలాంటి ముగ్గుపిండి పావుకిలో రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు. కిలో రూ. 70లుగా విక్రయిస్తుండగా, ముగ్గుపిండి కలిపిన రంగుపొడి కిలో రూ. 60కు విక్రయిస్తున్నారు. కేవలం తెల్లని ముగ్గుపిండి కిలో రూ.20 ఉండగా, ఏడు రంగుల పెద్ద చాక్‌పీస్‌లు రూ. 20లకు విక్రయిస్తున్నారు. రంగుపొడులుగల ఐదు చిన్న ప్యాకెట్ల కవర్ రూ.20లకు, 20 చిన్నప్యాకెట్లు గల కవర్ రూ. 50లకు విక్రయిస్తున్నారు. కళ్లాపి చల్లేందుకు వినియోగించే పేడ రంగు ప్యాకెట్ రూ. 5–10లకు అమ్ముతున్నారు.



మార్కెట్‌లో పలు రకాల రంగు పొడులు

ఖర్చయినా.. ఇష్టంగా..

ఓ మోస్తరు ముగ్గువేసి రంగులు నింపాలంటే కనీసం రూ. 50 నుంచి రూ. 100 రంగు పొడులు అవసరమవుతాయి. ముందే రంగులు కలిపిన ముగ్గుపిండిని ప్రత్యేకంగా అమ్ముతున్నారు గనుక మహిళలు రంగులు కొనాల్సిన అవసరం లేకుండా పోతోంది. చాక్‌పీస్‌లతో చిన్నసైజు గీతల ముగ్గు వేయాలంటే కనీసం రూ. 20 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కొక్క కట్టలో ఐదారు రకాల రంగుల చాక్‌పీసులు ఉంటాయి. ముగ్గులు వేయడం కంటే అందులో రంగులు నింపి తుది మెరుగులు దిద్దడానికే ఎక్కువ శ్రమపడాల్సి వస్తోంది. అయినా మహిళలు దీన్ని తమ ప్రతిష్టగా భావించి ఇంటిలోని ఇతర మహిళలతో కలిసి తమ ఇళ్ల ముందు రంగులతో భారీ ముగ్గులను తీరుస్తున్నారు. పండుగ కోసం రెండు, మూడురోజుల ముందు నుంచి ముగ్గులు వేయడం ప్రారంభించారు.

క్లుప్తంగా

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా పాకా సురేష్



కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా కడప నగర పాలక సంస్థ 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఐదుగురు సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేయాల్సి ఉంటుంది. ఇందులో స్థానిక సంస్థల నుంచి పాకా సురేష్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ఈయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కడప నగరపాలక సంస్థగా ఆవిర్భవించాక 2005లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలుపొందిన పాకా సురేష్, తర్వాత 2012లో, 2020 ఎన్నికల్లో వరుసగా కార్పొరేటర్‌గా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

ప్రైవేట్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కడప శివార్లలోని ఊటుకూరులో ఉన్న జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఆర్టీసీ బస్సుల చార్జీల కంటే ఎక్కువగా చార్జీలు వసూలు చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించకుండా బస్సులు తిరిగితే కేసు నమోదు చేసి బస్సును సీజ్ చేస్తామన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై అధికారుల దాడులు

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. వాహన పత్రాలు సక్రమంగా లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను తరలించే వాటికి సంబంధించి అధికారులు రికార్డులను పరిశీలించి కేసులు నమోదు చేశారు. రెండు రోజుల నుంచి నిర్వహించిన దాడుల్లో 11 కేసులు నమోదు చేసినట్లు డీటీసీ మీరా ప్రసాద్ తెలిపారు.

అంతర్ జిల్లా గంజాయి ముఠా గుట్టు రట్టు

30కిలోల గంజాయి, కార్లు స్వాధీనం, ఐదుగురు అరెస్ట్



గంజాయి,నకిలీనోట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలో గల సబ్ స్టేషన్ వద్ద అంతర్‌జిల్లా గంజాయి విక్రయ ముఠా, నకిలీ నోట్ల చెలామణికి సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.వీరి నుంచి సుమారు 30 కిలోల గంజాయి, మూడు కార్లు, ఐదు సెల్‌ఫోన్‌లు, ఏడు నకిలీ 500 రూపాయల నోట్లు స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ సుమారు రూ. 40 లక్షలు ఉంటుందనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ తెలియజేశారు. అరెస్టయిన వారిలో పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు మండలం, బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన మొగల్లపు నవీన్‌కృష్ణ, కర్నూలు జిల్లా రుద్రవరం మండలం గొల్లపల్లి హరి, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం బుగ్గవీధికి చెందిన బుగ్గా బాబాఫక్రుద్దీన్ అలియాస్ బుల్లెట్, జిల్లాలోని దువ్వూరు మండలం నారాయణపల్లికి చెందిన గుర్రాల మునిరెడ్డి, కర్నూలు జిల్లా ఆలమూరు మండలం, చిత్రేనిపల్లెకు చెందిన జేష్టాది నడిపి ఓబులేసు ఉన్నారు. వీరిలో మొగల్ల కృష్ణనవీన్‌పై ఐదు కేసులు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ఉన్నాయి. గొల్లపల్లి హరిపై నాలుగు కేసులు, గుర్రాల మునిరెడ్డిపై రెండు కేసులు ఉన్నాయి. ఈ సంఘటనలో నిందితులుగా వుండి ఎక్కువ కేసుల్లో వున్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. ఎవరైనా గంజాయిని నిల్వఉంచినా, కొనుగోలు చేసినా, విక్రయించినా, యువతకు ఇతరులకు విక్రయించి వారిని మత్తులోకి దించి వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం కావడానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామనీ ఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారు పోలీసులను సంప్రదిస్తే వారికి పునరావాస కేంద్రాల్లో వైద్యసేవలను అందించడం ద్వారా ఉపశమనం పొందేందుకు కృషి చేస్తామన్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ వై. నరేంద్రారెడ్డి, దువ్వూరు ఎస్ఐ ఆర్. రాఘవేంద్రారెడ్డి, సబ్‌డివిజనల్ క్రైమ్ పార్టీ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, డీఎస్పీ, సీఐ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసులో ప్రతిభ కనపర్చిన వారికి నగదు రివార్డులను, ప్రశంసాపత్రాలను ఎస్పీ తమ చేతుల మీదుగా అందజేశారు.

రామేశ్వరం రిజర్వ్‌ఫారెస్ట్‌లో లోకాయుక్త ఆదేశాలతో రీ సర్వే

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని ఏకో పార్కు ఎదురుగా ఉన్న రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో లోకాయుక్త ఆదేశాలతో బుధవారం అధికారులు రీసర్వే చేపట్టారు. పట్టణానికి చెందిన న్యాయవాది పుత్తాలక్ష్మిరెడ్డి 2017లో ఈ స్థలంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో ఏక్ సాల్ అనుమతితో అనేక మందికి అధికారులు పట్టాలు మంజూరు చేశారని, స్థలం ఆక్రమణలకు గురికావడంతో హద్దులు సరిగా లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం హద్దులు నిర్ణయించాలని లోకాయుక్త ఆదేశాలు ఇవ్వడంతో సర్వే ప్రారంభించినట్లు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి తెలిపారు.

పెట్రోలు బంకు నిర్వహణకు అద్దెకు ప్రభుత్వ స్థలం

కడప సిటీ : పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని ఎర్రగుడిపల్లె గ్రామ సమీపంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పెట్రోలు, డీజిల్ అవుట్‌లెట్లను నెలవారి అద్దె ఆధారంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా పౌరసరఫరాలసంస్థ మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు డిప్యూటీ కలెక్టర్ల కృతజ్ఞతలు



డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో 66 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించడం పట్ల వారు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్లు కడప ఆర్డీఓ, అసోసియేషన్ అధ్యక్షులు ధర్మచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎంచే డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ డైరీని ఆవిష్కరింపజేసి ఆయనకు తమ సమస్యలను వివరించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ధర్మచంద్రారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, అసోసియేషన్ కోశాధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

సీఎం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

కడప ఎడ్యుకేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల గుర్తింపును 10 సంవత్సరాలకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా ముఖ్యమంత్రి అన్ని సమస్యలకు స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ టైలర్స్ కాలనీకి చెందిన షేక్ మహబూబ్‌బాషా (36) హీరో షో రూమ్ వెనుక వైపు నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం ఎస్ఐ హరిప్రసాద్ శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముందు గుర్తు తెలియని మృతదేహంగా భావించినా మధ్యాహ్నం తర్వాత టైలర్స్ కాలనీకి చెందిన పెయింటర్ మహబూబ్‌బాషాగా గుర్తించారు. అతనికి భార్య షబానా, ఇద్దరు కుమారులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం రాత్రి పదిన్నర గంటలకు మృతి చెంది ఉండవచ్చని డాక్టర్ చెప్పారన్నారు. బుధవారం శవాన్ని చూసినట్లు చెప్పారు. శరీరంపై గాయాలు లేవని, నోట్లో నుంచి నురగా వచ్చిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అట్లూరులో..

అట్లూరు : మండలంలోని అట్లూరు పునరావాసకాలనీ ఎల్లుగారిపల్లె కాలనీలో తంగా గోపాలస్వామి (48) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.ఎస్ఐ కె.సి.రాజు కథనం మేరకు గోపాలస్వామి మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఇతని భార్య పిల్లలు ఊరికి వెళ్లారు. మృతుడి సోదరి సుబ్బమ్మ బుధవారం గమనించింది. తన తమ్ముడి చేతులను వెనక్కు కట్టేసి ఉన్నారని, మృతిపై అనుమానాలున్నాయని, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనలో మరో మహిళ మృతి

పోరుమామిళ్ల : పట్టణంలోని పాతపోస్టాఫీసు వీధిలో ఈనెల 3 న జరిగిన గ్యాస్ లీకేజీ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన రజియాబీ (45) కర్నూలు జనరల్ ఆసుపత్రిలో మృతి చెందిందని ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 8 రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం రాత్రి మృతి చెందింది. రజియాబీకి భర్త ముగ్గురు పిల్లలున్నారు.



వైఎస్సార్‌సీపీ నుంచి కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి సస్పెన్షన్

- ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్‌బాషాకు వైఎస్సార్‌సీపీకి సంబంధంలేదు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఐదో వార్డు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డిని అధిష్టానం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఇక్కడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురళీధర్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మున్సిపల్ చైర్మన్ నిర్వహించే ప్రోగ్రాంలు, స్థానిక శాసనసభ్యుడు నిర్వహించే కార్యక్రమాలకు హాజరు కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నిర్వహిస్తే ఉద్దేశపూర్వకంగా గైర్హాజరయ్యారన్నారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్‌బాషాతో కలిసి వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తున్న మురళీధర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అధిష్టానం ఆదేశించిందన్నారు. అలాగే మహమ్మద్ గౌస్ బాషాకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఆయనను వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తిగా గుర్తించవద్దని తెలియజేశారు. సమావేశంలో ప్రొద్దుటూరు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కోరుతూ పాదయాత్ర

మైదుకూరు : తమ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకొన్నాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ కుటుంబం బుధవారం పాదయాత్ర చేపట్టింది. దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన వెంగముని మైదుకూరులో నివాసం ఉంటున్నాడు. దువ్వూరు మండలం సి.బయనపల్లె వద్ద తాము 10 ఏళ్ల కిందట 80 సెంట్ల భూమిని కొనుగోలు చేశామన్నారు. దీనిని శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకొని తమపై దౌర్జన్యం చేస్తున్నాడని వెంగముని ఆరోపిస్తున్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మైదుకూరు నుంచి దువ్వూరు తహసీల్దార్ కార్యాలయం వరకు భార్యాపిల్లలతో పాదయాత్ర చేపట్టారు.



వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గిడుగు రుద్రరాజు, తదితరులు

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్సార్ సమాధికి కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుని వైఎస్సార్ సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో తనకు అనేక పదవులు ఇచ్చారని.. వైఎస్సార్‌తో సన్నిహితగా ఉండి పార్టీ కోసం పని చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, ఉత్తన్న, సత్తార్, బద్రి, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అప్రెంటీస్ అభ్యర్థుల జాబితా విడుదల

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్ శిక్షణ పొందేందుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు ఆర్టీసీ కర్నూలు జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ కె.రవి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలో 91 మందికి అవకాశం కల్పించారన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీ ఉదయం 9గంటలకు కర్నూలు లోని ఆర్టీసీ జోనల్ కళాశాల హాజరుకావాలని ఆయన కోరారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలు, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్‌తోపాటు నాలుగు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకు రావాలన్నారు.

ప్రయాణికుల రద్దీ కారణంగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాదు-తిరుపతి-హైదరాబాదు (07083/07084) మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప స్టేషన్ మేనేజర్ డీఎన్ రెడ్డి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషలు తెలిపారు. 12వ తేదీ గురువారం సాయంత్రం 6.10 గంటలకు హైదరాబాదులో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.40 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు.తిరపతిలో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.15 గంటలకు హైదరాబాదుచేరుతుందన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో 14 పతకాలు

కడప స్పోర్ట్స్: కర్నూలు నగరంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ ఫేజ్-2 వెయిట్‌లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ సాధించింది. టోర్నమెంట్‌లో 10 మంది బాలురు, 10 మంది బాలికలు క్రీడాపాఠశాల నుంచి పాల్గొని 14 పతకాలు కైవసం చేసుకున్నట్లు క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ తెలిపారు. బాలబాలికల విభాగంలో విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ శిక్షణ అందించిన వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు శివశంకర్‌రెడ్డిని ఆయన అభినందించారు.